ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
ఆదివారం 15 జూన్ 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 26.0



"సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఒక మార్గం.. మొక్కుబడిగా కాకుండా ఇష్టంతో చేయండి.. యోగా మన నిత్య జీవితంలో ఒక భాగం కావాలి.." - కలెక్టర్ వెట్రిసెల్వి

పెదపాడు మండలం వట్లూరులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆసనాలతో అబ్బురపరిచారు..



కొత్త ఉత్తేజం

రహదారులు గుంతలు పడి, ప్రజలకు ప్రాణాంతకంగా మారినా మరమ్మతులకు దిక్కులేదు. పంటలకి తగినంత ధర లేకపోయినా అమాత్యులెవరు ఆ వైపు తొంగి చూసేవారే కాదు. ప్రణాళికాబద్ధంగా ఏ నెలకానెల అడుగులు వేయాల్సిన శాఖలు చతికిలపడితే చేయూత నిచ్చేవారే లేరు. పర్యాటకం లేదు.. ప్రజలకు నచ్చే కార్యక్రమాలు అంతకంటే లేవు.. ఇదంతా జగన్ జమానాలో పాలనా నిస్తేజానికి నిదర్శనం. ఏడాది కాలంలో ఒక్కొక్కటిగా గాడిన పెడుతున్నారు. నెలకో ఆరు నెలలకో సాగే సమీక్షలకు తెరదించారు. ప్రజా క్షేత్రం వైపు అడుగులు వేస్తూ వారికి చేరువవుతూ అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది.. ఇప్పుడు అన్ని శాఖల్లోనూ చేతినిండా పని ఉంటోంది..

అధికార యంత్రాంగంలో ఉత్సాహం
ప్రజాక్షేత్రం వైపు అడుగులు
అన్ని ప్రభుత్వ శాఖల్లో భారీ కదలిక
నిధుల దగ్గర్నుంచి పనులు జరిగేంత వరకు
ప్రాధాన్యతా శాఖల్లో పనులతో బిజీ
పాత పోకడలకు స్వస్తి
ఏడాదిలో వచ్చిన మార్పులెన్నో

(ఏలూరు -ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గత వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధులే కాదు.. అధికార యంత్రాంగంలోనూ నిస్తేజం కనిపించేది. కేవలం బులుగు రంగు వ్యక్తులకే పెద్దపీట వేసే అధికారులు ఆనాడు అన్ని శాఖల్లో కనిపించేవారు. ఫ్యాన్ గాలికి అలవాటు పడినవారంతా ఏకపక్షంగా వ్యవహరించేవారు. ఇప్పుడా ఆ సీన్ కాస్త మారింది. టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ బాధ్యులైన అధికారులు, సిబ్బందితో నేరుగా సమీక్షలతో ఎక్కడికక్కడ శాఖలవారీగా మార్పులు, చేర్పులు చేయగలిగారు. ఎక్కడ ఏ లోపం తలెత్తినా జిల్లా కలెక్టర్ దగ్గర్నుంచి సంబంధిత శాఖాధికారి వరకు తక్షణం స్పందించి తీరాల్సిందే. గతంలో మాదిరిగా ఇష్టానుసారం వ్యవహరించే రోజులకు కాలం చెల్లింది. ఆ స్థానంలో శాఖల వారీగా ఇప్పుడు చేతినిండా పనికుదిరింది. ప్రత్యక్ష కార్యాచరణ జరిగేలా ఎప్పటికప్పుడు నిఘా వేసి ప్రశ్నించే అధికారుల సంఖ్యా పెరిగింది. వివిధ శాఖాధిపతులతో సహా సిబ్బంది సైతం చేతినిండా పనిలేక జగన్ జమానాలో గోళ్లు గిల్లుకునేవారు. మరికొందరు ఇలా ఆఫీస్‌కు వచ్చి అలా ఇంటికి వెళ్లిపోయేవారు.

ఈ ఏడాదిలో ఏమి జరిగిందంటే :

పనిచేయడమే కాదు.. పనిచేయించుకోవడం తెలుగుదేశం అధికారంలోకి ఎప్పుడొచ్చినా ఇదే విధానం అన్వయించుకుంటుంది. జగన్ జమానాలో పప్పు, బెల్లాలా ఎడాపెడా బటన్ నొక్కుడులకు సరిపోయింది. కానీ ఈ ఏడాది కాలంలో మొత్తం సీన్ మారిపోయింది. పాలనా పరంగా ఇప్పుడు కొంత మెరుగైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతీ కార్యాలయంలోను అధికారులు, సిబ్బంది నిండుగా కనిపిస్తున్నారు. అంతకంటే మించి తమ శాఖలకు సంబంధించి పురోగతి కోసం వీలైతే ఉన్నతాధికా రులతో చర్చించి నిధులు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ పరిధిలో గడిచిన ఐదేళ్లలో నయాపైసా కూడా ఈ శాఖకి అందుబాటులోకి లేకుండా పోయింది. రోడ్లు గుంతలు పడ్డాయని, ప్రయాణం నరకంగా మారిందని నెత్తి, నోరు కొట్టుకున్నా బేఖాతర్. తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం అనుకున్నది అనుకున్నట్లుగా సంక్రాంతి లోపే రెండువేల కిలోమీటర్లకు పైగా మరమ్మతులకు దిగింది. ఇప్పుడు ఆర్అండ్‌బీ శాఖ చేతినిండా పనితో మునిగి తేలుతోంది. పంచాయతీరాజ్ శాఖలో ఇంతకు ముందు చడీ, చప్పుడు ఉండేది కాదు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొంత చొరవ తీసుకున్న కారణంగా రహదారులు, వంతెనల నిర్మాణం సాధ్యమైంది. అలాగే పల్లె సీమల్లో చిన్నా, చితకా సమస్యలను ఇప్పటికే పరిష్కరించారు. సర్పంచ్‌లకు ఒక గౌరవం కల్పించినట్లైంది. జలవనరుల శాఖ ఈ ఏడాది పూర్తిగా నిలదొక్కుకుని కాల్వలు, లాకుల మర్మతులకు సిద్ధపడింది. ఈ మధ్యనే రూ.20 కోట్లతో ఈ పనులన్నింటిని చక్కబెట్టారు. ఐదేళ్ల జగన్ జమానాలో ఇలాంటి పనులు ఆనాటి ప్రభుత్వానికి కనిపించ లేదు. నిస్తేజంగా మారిన వ్యవసాయశాఖ, సహకారశాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఉద్యానవనశాఖ, విద్యుత్, ప్రణాళిక, సాధారణ పరిపాలన, పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల పరిధిలో పెనుమార్పులే జరిగాయి. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, సరికొత్త విధానాలు తెలుగుదేశం ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. రిజిస్ట్రేషన్ల శాఖలో దళారులకు అవకాశం లేకుండా నేరుగా స్లాట్ విధానం అమల్లోకి తీసుకువచ్చారు. పౌరసరఫరాల్లో కార్డుల దగ్గర్నుంచి, సరుకుల పంపిణీ వరకు సరికొత్త విధానాలు అమల్లోకి తెచ్చారు. వ్యవసాయశాఖలో ఇంతకుముందు కదలిక ఉండేది కాదు. కానీ ఈ ఏడాది ఎవ్వరూ ఊహించని విధంగా మార్పులు, చేర్పులు కనిపించాయి. విద్యాశాఖలోను సమూల మార్పులు చేశారు. పరీక్షల నిర్వహణ దగ్గర్నుంచి ఫలితాల వెల్లడి వరకు అంత వేగంగానే సాగింది.

కుదురుకున్న వ్యవస్థలు

ఇష్టానుసారం చెల్లాచెదురుగా మారిన శాఖలన్నీ ఈ ఏడాదిలో కొంత మేర గాడిన పడ్డాయి. జిల్లా ఎస్పీ కేవీపీఎస్ కిషోర్ కొంత సాంకేతిక ప్రతిభను కనపర్చడమే కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికి కృత్రిమ మేధ ఉపయోగించి దరఖాస్తుల స్వీకరణను సులభతరం అయ్యేలా చూడగలిగారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని అమలు చేసి అందరు ఈ వైపు చూసేలా చేశారు. శాఖాపరంగా ఇంతకుముందెన్నడూ లేని విధంగా సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం వచ్చింది. వన్‌సైడ్ వ్యవహారం పోలీస్‌శాఖలో పూర్తిగా తెరపడింది. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సైతం సమీక్షా పరంగా గతంలో కొంత తడబాటు పడినా ఈ మధ్య కాలంలో కొంతలో కొంత వేగం పుంజుకున్నారు. ఇప్పుడు క్షణం ఖాళీ లేకుండా అధికారులతో సమీక్షించి ఆ మేరకు పరుగులు పెట్టిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఒక సవాల్ కాగా, దీనిలో జిల్లా యంత్రాంగం పాత్ర కూడా అత్యంత కీలకమే. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే మార్పు, చేర్పుతో పాటు ప్రజలకు యంత్రాంగం చేరువయ్యేలా కొంత మేర విజయం సాధించగలిగారు.



టీచర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా విద్యా శాఖ డీఈవో, సిబ్బంది

హమ్మయ్య..

కోరుకున్న స్థానాలకే బదిలీ ..
ఉపాధ్యాయుల సంతృప్తి
6,482 మంది స్థాన చలనం
ఆన్‌లైన్, మాన్యువల్ కౌన్సెలింగ్ సక్సెస్
విద్యాశాఖ ఉన్నతాధికారుల అభినందన

ఏలూరు అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయులు, హెచ్ఎంల సాధారణ బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్ శనివారం ముగిసింది.మే 21న ప్రారంభమై మూడు వారాలపాటు ఏకబిగిన రేయింబవళ్లు ఈ ప్రక్రియ కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో 11,409 మంది వర్కింగ్ టీచర్లలో 6482 మంది అన్ని కేడర్ల నుంచి కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారు. చివరిగా ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో ఏలూరు జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహించిన కౌన్సెలింగ్ శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముగిసింది. మొత్తం మీద తాజా కౌన్సెలింగ్‌లో గ్రేడ్-2 హెచ్ఎంలు 114 మంది, పీఎస్‌హెచ్ఎంలు 127 మంది, స్కూల్ అసిస్టెంట్(నాన్ లాంగ్వేజెస్) 2,045 మంది, స్కూల్ అసిస్టెంట్(లాంగ్వేజెస్) 1,242 మంది, సెకండరీగ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 2,862 మంది, లాంగ్వేజి పండిట్లు 54 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 38 మంది బదిలీ అయ్యారు. ఆన్‌లైన్, మాన్యువల్ కౌన్సెలింగ్ రెండింటిలోను కోరుకున్న స్థానాలకే బదిలీ స్థానాలు రావడంపై ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో జిల్లాకు 4వ స్థానం

ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహణ, ముగింపులో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 4వ స్థానం లభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లాకు శనివారం సమాచారం ఇచ్చారు. టీచర్ల ట్రాన్స్‌ఫర్లపై రాష్ట్ర పరిశీలకునిగా జిల్లాకు నియమితులైన సమగ్రశిక్ష అడిషినల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, కాకినాడ ఆర్జేడీ నాగమణి తమ సందేశాలను డీఈవో వెంకటలక్ష్మమ్మకు పంపారు. పరిమిత సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ, అందరినీ సమన్వయ పరుచుకుని అతిపెద్ద బదిలీల ప్రక్రియను వివాదాలకు అతీతంగా ముగించారని అభినందించారు. బదిలీలను విజయవంతంగా ముగించడంపై డీఈవోకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ఇక మీదట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంపైన, మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలు చేయడంపైన, తల్లికి వందనం ఆర్థికసాయం పథకం అర్హులైన వారందరికీ అందేలా చూడటంపైన దృష్టి సారించాలని సూచించారు.

117 జీవో రద్దు విద్యా వ్యవస్థకు మేలు : ఆప్టా

పెదవేగి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిన జీవో 117 రద్దు విద్యా వ్యవస్థ మెరుగుదలకు దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరామ్, ఎం.శ్రీనివాసరావులు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి రూపొందించిన చట్టం పారదర్శకంగా ఉండడంతో బదిలీలు సక్రమంగా జరిగాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 117 జీవోతో విద్యావ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని ఆ జీవో రద్దు చేసి అందరికీ ఆమోద యోగ్యమైన విద్యావిధానాన్ని అమలులోకి తేవడంతో విద్యావ్యవస్థ తిరిగి గాడిన పడిందని చెప్పారు.సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో జరిపినందుకు మంత్రి లోకేశ్‌తోపాటు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజుకు ఆప్టా తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



ఎంపీపీని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సారథి

అభివృద్ధే ఆకర్షిస్తోంది..

మంత్రి కొలుసు పార్థసారథి
టీడీపీలోకి నూజివీడు ఎంపీపీ

నూజివీడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష శనివారం మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. ఎంపీపీ శిరీషతో పాటు మరో 40 మంది వైసీపీ కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ కండువా కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందనారు. దూరదృష్టి, పరిపాలనా దక్షకుడు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి వచ్చే ప్రతీవారికి ప్రత్యేక గౌరవం తెలుగుదేశం పార్టీ ఇస్తుందని మంత్రి అన్నారు.



ఏలూరు కలెక్టర్ బంగ్లా సమీపంలో ఏర్పాటు చేసిన బుక్ నూక్ సెంటర్

చదువుదాం..చదివిద్దాం

పఠనాసక్తిని పెంచేందుకు బుక్ నూక్.. వెబ్‌సైట్ : జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పఠనాసక్తి పెంపొందించడం లక్ష్యంగా ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ' ఏలూరు బుక్ నూక్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుస్తక ప్రియులతో పాటు, కొత్తవారిలో కూడా పఠనాసక్తి కలిగించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఏలూరు బుక్ నూక్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతన పుస్తక సేకరణ కార్యక్రమంతో పాటు, సరికొత్త వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://ఏలూరుబుక్ నూక్.కామ్‌ను శనివారం ఆవిష్కరించినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుతం ఉన్న 3 కేంద్రాలను భవిష్యత్‌లో 100 పుస్తక కేంద్రాలకు విస్తరించేలా ఏర్పాట్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కేవలం పుస్తకాలను సేకరించడమే కాకుండా అదించడం ద్వారా ప్రతీఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిషోర్, పాల్గొన్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర ఎంతో కీలకం : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల విచారణలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర ఎంతో కీలకమైందని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్ళతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కేసులు నమోదు చేసిన తరువాత వేగంగా కోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. జిల్లాలో ఎవరైనా నేరం చేయాలంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా కోర్టులో ముద్దాయిలకు శిక్షపడే విధంగా విధి నిర్వహణ చేయాలన్నారు. కోర్టు కేసుల విచారణకు సాక్ష్యులను సకాలంలో కోర్టుకు హాజరుపర్చాలని సూచించారు.విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రీసర్వే పాపం.. రైతులకు శాపం

జాయింట్ ఎల్‌పీఎం నంబర్లతో చిక్కులు
ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే పరిస్థితి
రీసర్వే తప్పులను సరిదిద్దే పనిలో అధికారులు

ఏలూరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే అస్తవ్యస్తం కారణంగా ఇప్పటికీ అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. భూసర్వే కారణంగా ఇద్దరు నుంచి 10 మంది దాకా రైతులకు జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) నంబర్లు ఇచ్చారు. జాయింట్ ఎల్పీఎంలు ఉన్న రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. పట్టాదారుడి పేరుపైనే పాసు పుస్తకాలు పక్కాగా ఉంటేనే బ్యాంకు రుణాలు ఇస్తున్నారు. వైసీపీ పాలనలో చేపట్టిన భూములు రీసర్వే రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు మండలంలో మాదేపల్లి, కోమటిలంక, పంచాయతీలలో భూముల రీసర్వే చేపట్టారు. రీసర్వే కారణంగా భూముల్లో భారీ వ్యత్యాసం వచ్చింది. దీంతో ఇద్దరు నుంచి ఐదుగురికి కలిపి పాసు పుస్తకం ఇచ్చారు. మాదేపల్లి గ్రామంలో 1,507 ఎకరాలు, కోమటిగుంట లంక గ్రామాల్లో 1,610 ఎకరాల్లో సర్వే పూర్తయింది. జాయింట్ సీసీసీలు రావడంతో ఇద్దరు నుంచి ఐదుగురి దాకా రైతులకు కలిసి పాసుపుస్తకాలు ఇచ్చారు. దీంతో రైతులు రీసర్వేపై అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రైతుల వద్ద ఉన్న పట్టాదారు పుస్తకానికి, రీసర్వే చేసిన తరువాత జగనన్న పేరుతో ఇచ్చిన పాస్ పుస్తకాల్లో భూ విస్తీర్ణంలో భారీ తేడాలు ఉండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాయింట్ ఎల్పీఎంలతో రైతులకు ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పెట్టుబడి సహాయ పథకాలు దూరమయ్యే పరిస్థి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతో రీసర్వే భూములను తిరిగి సర్వే చేసి రెవెన్యూ రికార్డులను చక్కపెట్టే పనిలో అధికారులు ఉన్నారు. ఈ మేరకు రెవెన్యూ, సర్వే అధికారులు రీ సర్వేని పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 30వ తేదీలోగా సర్వే పూర్తిచేయాల్సి ఉంది.



మాదేపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)



దుంపగడపలో సమావేశమైన ఆకివీడు మండలం కొల్లేరు రైతులు, ప్రతినిధులు

సాధికార కమిటీ దృష్టికి సమస్యలు..

ఆకివీడు రూరల్ జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజలు, రైతులు సమస్యలపై సమైక్యంగా వెళదామని కొల్లేరు రైతులు తీర్మానించారు. ఆకివీడు మండలం దుంపగడపలో సమావేశం నిర్వహించారు. 20 సంవత్సరాలు కాంటూరు విషయమై జిరాయితీ రైతులు తీవ్రంగా నష్టపోయారని, భూములు బీడువారి ఏం చెయ్యాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి సుప్రీంకోర్టు వెలుగు చూపించిందని, ఈ నెలలో సాధికార కమిటీ పర్యటిస్తుందని వారి దృష్టికి సమస్యలు తీసుకు వెళదామని నిర్ణయించారు.



కుక్కునూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

అనర్హులకు అవకాశం

తల్లికి వందనం ఫిర్యాదుల స్వీకరణకు మార్గదర్శకాలు ఇలా.. 3

ఏఎన్ఎంల బదిలీ పదోన్నతి కౌన్సెలింగ్ నేటికి వాయిదా

బిజినెస్ ప్లస్

తాడేపల్లిగూడెం ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.



లవ్ యూ నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్లు పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్ లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసికి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..

ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జిఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తియుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.

ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు



సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టా‌స్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.



మార్‌క్రమ్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ఠ సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హోప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హోప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

నేటికి ఏఎన్‌ఎంల బదిలీ, పదోన్నతి కౌన్సెలింగ్ వాయిదా

ఏలూరు అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు శనివారం జరగాల్సిన బదిలీ కౌన్సెలింగ్ ఆదివారానికి వాయిదా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం తొమ్మిది నుంచి జూమ్ విధానంలో పీహెచ్‌సీల వైద్యాధికారుల సమక్షంలో రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. అది ముగిసిన వెంటనే మధ్యాహ్నం నుంచి మాన్యువల్ విధానంలో ఏలూరు కలెక్టరేట్ హాలులో 256 మంది గ్రేడ్-3 సచివాలయ ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) పదోన్నతి కౌన్సెలింగ్‌ను చేపడతామని వివరించాయి. పదోన్నతి కౌన్సెలింగ్ ఆదివారం రాత్రి వరకు చేపడతామని, అప్పటికీ పూర్తి కాకపోతే మిగిలినవారికి సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొనసా గించేలా నిర్ణయించినట్టు తెలిపాయి. తొలుత తీసుకున్న నిర్ణయం ప్రకారమే బదిలీ, పదోన్నతి కౌన్సెలింగ్‌లను ఒకేరోజున చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినందున, ఆ మేరకు శనివారం జరగాల్సిన బదిలీ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని శుక్రవారం అర్ధరాత్రి తర్వాత మౌఖిక ఆదేశాలు అందాయని అధికార వర్గాలు తెలిపాయి.

వైఎస్ఆర్ క్రీడా స్కూల్లో అడ్మిషన్లకు 19వ తేదీ ఆఖరు

ఏలూరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైఎస్ఆర్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 ఏడాదికి గాను 4, 5 తరగతి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతి అడ్మిషన్లకు 2015 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. 5వ తరగతి అడ్మిషన్లకు 2014 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19వ తేదీతో ఆఖరు అన్నారు. ఈనెల 20 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ పరిశీలించిన అనంతరం విడుదల చేసిన జాబితా ప్రకారం జూలై ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఆయా క్రీడాప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 98663 17326 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎస్సీ సీనియర్ ఇంటర్ విద్యార్థులు బ్యాంకు ఖాతా అనుసంధానం చేసుకోండి

తాడేపల్లిగూడెం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం పథకంలో అర్హులైన ఎస్సీ సీనియర్ ఇంటర్ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించు కోవాలని జిల్లా సంక్షేమ, సాధికార అధికారి బి.రామాంజనేయరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా జిల్లాలో 1,643 మంది ఎస్సీ సీనియర్ ఇంటర్ విద్యార్థులు వారిపేరున ఉన్న బ్యాంకు ఖాతా ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా తల్లికి వందనం ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈనెల 16న అర్హులైన ఇంటర్ రెండో సంవత్సర విద్యార్థులు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతా తెరవాలని ఖాతా ఉన్నవారు, ఆధార్ అనుసంధానం చేసుకోవడం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.

జడ్పీ సీఈవో శ్రీహరిని కలిసిన ఏపీజీఈఏ నాయకులు

ఏలూరుసిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ సీఈవో ఎం.శ్రీహరిని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు (ఏపీజీఈఏ) శనివారం జడ్పీ సీఈవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి ఏడీఎస్ఆర్ఎం బంగారయ్య, ఎస్.కుసుమ, జగదీశ్వరి, మహేశ్వరి, డి.శాంతి, ఏలూరు తాలూకా అధ్యక్షురాలు టి.సీలిమాదేవి, వై.నవీన్‌సుందర్, ఎస్.ఫణిశంకర్ లు జడ్పీ సీఈవోను కలిసిన వారిలో ఉన్నారు.



శ్రీవారి ఆలయ అనివేటి మండపం వద్ద భక్తుల రద్దీ

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

ద్వారకాతిరుమల, జూన్14 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధి శనివారం భక్తజనులతో పోటెత్తింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. అన్ని విభాగాలు భక్తులతో సందడిగా మారాయి. శ్రీవారి నామస్మరణ మార్మోగింది. వేలాది మంది భక్తులు క్షేత్రానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 20వేల మంది వరకు భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం వారంతా ఉచిత తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత వకుళమాత ఉచిత అన్నప్రసాద భవనంలో స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దాదాపు 120 జంటలు స్వామి వారి నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్నారు.

నటుడు అల్లం గోపాలరావు మృతి

» గుండుగొలనులో విషాద ఛాయలు



గోపాలరావు (ఫైల్)

భీమడోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ, టీవీ నటుడు గుండుగొలను వాసి అల్లం గోపాలరావు (75) మృతి పట్ల గుండుగొలనులో విషాదఛాయలు అలముకున్నాయి. గుండుగొలనులో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచి నాటక రంగంలో అనేక మెట్లెక్కి అటు టీవీ, సినీరంగంలో పేరు తెచ్చుకున్నారు. గుండుగొలనులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఆయన స్వస్థలం అంటే అమితమైన అభిమానం కనబర్చేవారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో శనివారం ఉదయం మృతి చెందారు.

ఫొటోల మార్ఫింగ్ కేసులో ఒకరి అరెస్ట్

భీమవరం క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణానికి చెందిన ఒక మహిళతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పరిచయం చేసుకుని ప్రేమించానని నమ్మించాడు. అనంతరం ఫొటోలు మార్ఫింగ్ చేస్తానని డబ్బులు వసూలు చేశాడు. అంతేకాకుండా ఆమెతో అసభ్యంగా మాట్లాడడంతో ఆమె భీమవరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన వన్‌టౌన్ సీఐ నాగరాజు తెనాలి పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్ సమీర్ అనే అతడిని గునుపూడి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు. సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

ఒకే కుటుంబంలో నలుగురికి తల్లికి వందనం

తణుకు రూరల్ మండలం మండపాకకు చెందిన సుంకర సత్తిబాబు, దేవి దంతులకు ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. వ్యవసాయాధారంగా జీవించే ఆ దంపతులు వారందరినీ గ్రామంలోని ప్రభుత్వ బడులలో చదివిస్తున్నారు. వీరిలో పెద్ద కుమార్తెను చదువు మాన్పించి ఇంటి పనిలో వుండగా మిగిలిన నలుగురు కుమార్తెలు ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. సుంకర దుర్గాభవాని 9వ తరగతి, మహేశ్వరి 8వ తరగతి, యల్లారి 6వ తరగతి, రేణుక అపర్ణ 2వ తరగతి చదువుతున్నారు. వీరందరూ తల్లికి వందనం పథకానికి అర్హత సాధించడంతో ఆ నలుగురు ఆడ బిడ్డలకు సంబంధించిన తల్లి బ్యాంక్ ఖాతాలో నగదు జమ కావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వ సహకారంతో చదివిస్తున్నాం

కూలి పని చేసుకునే మాలాంటి వారికి ప్రభుత్వ పథకాలతో పిల్లలను చదివించగలుగుతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందిస్తుంది. ఇప్పుడు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పేరుతో నగదు వేయడం సంతోషంగా ఉంది. మాకు ముగ్గురు పిల్లలు ఎనిమిది, ఏడు, నాలుగో తరగతులు చదువుతున్నారు.

– బుంగా వెంకటేష్ ఆకివీడు



ఆనందం వెల్లివిరిసె..

తల్లికి వందనం నగదు జమతో తల్లిదండ్రుల్లో సంతోషం

తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ప్రభుత్వం రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వణుదుర్రులో వెల్లివిరిసిన ఆనందం

ఒకే గ్రామంలో ముగ్గురేసి పిల్లలున్న ఏడు కుటుంబాలకు లబ్ధి

ముదినేపల్లి : ముదినేపల్లి మండలం వణుదుర్రులో ఆనందం వెల్లివిరిసింది. ఆ గ్రామంలో 99.5శాతం విద్యార్థులకు ఈ పథకం లబ్ధి చేకూరింది. గ్రామ యూపీ పాఠశాలలో 74 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తల్లికి వందనం లబ్ధి పొందేందుకు అర్హత సాధించడం విశేషం. గ్రామంలో ముగ్గురు పిల్లలు కలిగి ఉన్న ఏడు కుటుంబాల వారు ఈ పథకం లబ్ధి పొందారు. గ్రామానికి చెందిన భట్టురాజు, శ్రీవాణి కుటుంబం, చిట్టిబొమ్మల రాముడు, సీతామహాలక్ష్మి కుటుంబం, గుర్రుపు శివసుబ్రమణ్యం పద్మ కుటుంబం, దారం అప్పన్న, సుకన్య కుటుంబం, ప్రత్తిపాటి అరుణ, తాడంకి సురేష్, వెంపా అచ్చయ్య కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లల చొప్పున తల్లికి వందనం లబ్ధి చేకూరింది. ఈ లబ్ధి పొందిన వారిలో ఇద్దరు పిల్లలు కల్గిన కుటుంబాలు 22 ఉన్నాయి. గతంలో అమ్మఒడి పథకం కింద 45 శాతం పిల్లలు మాత్రమే ప్రయోజనం పొందేవారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఆ గ్రామంలోని అర్హులైన వారందరికీ తల్లికి వందనం ప్రయోజనం కలిగింది.



వణుదుర్రులో భట్టు శ్రీవాణి, ముగ్గురు పిల్లలు



వణుదుర్రులో చిట్టిబొమ్మల సీతామహాలక్ష్మి, ముగ్గురు పిల్లలు

ఫిర్యాదుల స్వీకరణకు మార్గదర్శకాలు ఇలా..

ఏలూరు అర్బన్ : తల్లికి వందనం ఆర్థికసాయం పథకానికి అనర్హులైన విద్యార్థుల జాబితాల్లో తమ పిల్లల పేర్లున్నాయని తల్లిదండ్రులు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో వీటిని స్వీకరించే ప్రక్రియపై డీఈవో వెంకటలక్ష్మమ్మ శనివారం మార్గదర్శకాలు విడుదల చేశారు. సంబంధిత సచివాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్లు/ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలు ఎన్‌బీఎం పోర్టల్‌లో లాగిన్ అయి సర్వీస్ రిక్వెస్టులో గ్రీవెన్స్‌ను రైజ్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చారని వివరించారు. సాంకేతిక కారణాల వల్ల తాత్కాలికంగా ఇనెలిజిబుల్ (అనర్హత)గా కనిపిస్తున్న వారి వివరాలను ఆఫ్‌లైన్ రిజిస్టర్‌లో నమోదుచేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్ నమోదు చేసిన తర్వాత ఆరు స్టెప్ వాలిడేషన్ ప్రక్రియద్వారా విద్యార్థి అర్హతపై స్పష్టత వస్తుందన్నారు. సంబంధిత కారణాలను పరిశీలించి, తగిన ఆధారాలతో దరఖాస్తును సమర్పించాల్సిఉంటుందని సూచించారు. ఈ ప్రక్రియను జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి వచ్చే ఏ ఒక్క ఫిర్యాదును నమోదు చేయకుండా వెనక్కి పంపరాదని స్పష్టం చేశారు. ఈ పథకం అమలులో పాఠశాల విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, పథకాన్ని విజయవంతంగా అమలుచేయాలని ఆదేశించారు. ఈ మేరకు తల్లితండ్రులకు సరైన మార్గదర్శకత్వంచేసే బాధ్యత స్థానిక డీవైఈవోలు, ఎంఈవోలపై ఉందని వివరించారు. అభ్యంతరాలు స్వీకరించే గడువు ఈనెల 20వరకు ఉందని, వాటిని పరిశీలించి, అర్హతలు కలిగిన లబ్దిదారుల అదనపు జాబితాను ఈనెల 21నుంచి 28వ తేదీవరకు జరుగుతుందని, తుదివిడత నగదు జమప్రక్రియ జూలై 5న జరుగుతుందన్నారు.

ప్రతి ఇంటిలోనూ పండుగ : మంత్రి నిమ్మల



డాక్టర్ అబ్దుల్ కలాం పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బడులు తెరిచినరోజునే తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం ఎంతమంది చదువుకునేపిల్లలు ఉంటే అందరికీ రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో ప్రతీ ఇంటిలోనూ పండుగ వాతావరణం సంతరించు కుందని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను మంత్రి శనివారం కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌కు తల్లికి వందనంపై మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు. ఈ పథకం కింద 67 లక్షల మంది చదువుకునే పిల్లలకు రూ.10.651 కోట్లను ప్రభుత్వం చెల్లించిందన్నారు. పాలకొల్లును రాష్ట్రంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవీ, నాయకులు వల్లభు శ్రీనివాస్, తమ్మినీడి సత్యనారాయణరావు, కర్నేన గౌరునాయుడు, గాది వెంకన్న, చినమిల్లి గణపతిరావు, అధికారులు ఉన్నారు.



కుటుంబ సభ్యులతో ఆనందం వ్యక్తం చేస్తున్న తాటిపాక రాజు

ప్రభుత్వానికి ధన్యవాదాలు

నేను చెరువుల వద్ద పని చేస్తుంటా.. మా ఇద్దరు పిల్లలు ఆనంద్‌కుమార్ 4వ తరగతి, సంతోష్‌కుమార్ 2వ తరగతి మౌంజీపాడులో చదువుతున్నారు. ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున రూ.26 వేలు నా భార్య ఖాతాలో జమ అయ్యాయి. గత ప్రభుత్వంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి వచ్చేది. ఇప్పుడు ఇద్దరికి డబ్బులు వచ్చాయి. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– తాటిపాక రాజు, మౌంజీపాడు

ఎంతో ఆనందంగా ఉంది



ప్రభుత్వం చెప్పినట్టుగా ఎంతమంది పిల్లలు ఉన్నా వారందరికి తల్లికి వందనం కింద నగదు జమ చేస్తామన్నారు. ఆ విధంగా సీఎం చంద్రబాబు మా ముగ్గురు పిల్లలకు రూ.13 వేలు చొప్పున రూ.39 వేలు జమ చేయడం ఆనందంగా వుంది. గతంలో ఒకరికే వచ్చేది. ఇప్పుడు ముగ్గురుకు రావడం, వారిని చదివించుకునేందుకు ప్రోత్సాహంగా ఉంటుంది.

– లోకేశు మంగాదేవి, పాలమూరు

ఇద్దరి పిల్లల సొమ్ములు వచ్చాయి



తల్లికి వందనం పథకం ద్వారా మా ఇద్దరి పిల్లలకు డబ్బులు బ్యాంక్‌లో జమయ్యాయి. తేతలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పెద్ద కుమార్తె దివ్యరోజ్ 7వ తరగతి, చిన్న కుమార్తె ఆరోహి 3వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం డబ్బులు నా బ్యాంక్ ఖాతాలో పడ్డాయి. చాలా సంతోషంగా వుంది.

– ముప్పిడి గ్లోరి, తేతలి, తణుకు రూరల్

వలంటీర్ల అవగాహన లోపంతో పలువురికి పథకం దూరం



ఆకివీడు : నగర పంచాయతీ పరిధిలో వలంటీర్ల అవగాహన లోపంతో ఇంటి కొలతలు సక్రమంగా చేయకపోవడంతో ప్రస్తుతం లబ్ధిదారులు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారని జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు అన్నారు. శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ టెక్నికల్ ఉద్యోగులు చేయాల్సిన సర్వే వలంటీర్లతో చేయించడం వల్ల అనుభవం లేకపోవడంతో బిల్డింగ్ కాంపౌండ్ వాల్ కొలతలు కొలిచి అధికపన్నులు వేయించడం వల్ల ఈ పథకానికి అడ్డంకిగా మారడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం నిబంధనల మేర బిల్డింగ్ ప్లింత్(పునాది గోడలు) ఏరియా కొలిచి దాని ప్రకారమే పన్నులు వేయాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా బిల్డింగ్ చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ కొలతలు తీయడం వల్ల కొంతమంది లబ్ధిదారులను జాబితానుంచి తొలగించారు. తప్పుడు కొలతల కారణంగా వృద్ధాప్య పింఛన్లు నష్టపోతున్నారన్నారు. ఈవిధంగా ప్రభుత్వ పథకాలను పట్టణ ప్రజలకు అందకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. అధికారులు చేసిన తప్పిదానికి లబ్ధిదారులు నష్టపోయారని, వారందరికి న్యాయం చేయాలన్నారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి



నాగరాజు(ఫైల్)

పెదవేగి, జూన్ 14(ఆంధ్రజ్యోతి):పెదవేగి మండలం చక్రాయ గూడెంకు చెందిన ఉపాధి కూలి శ్రీనాధరాజు నాగరాజు(53) వడదెబ్బకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొద్దుల చెరువులో జరుగుతున్న పనికి కూలీగా నాగరాజు వెళ్లాడు. చెరువులో మట్టి పనులు చేస్తుండగా గురువారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. వెంటనే అతడిని ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతడికి భార్య సీతామహాలక్ష్మి, ఒక కుమారుడు, వివాహమైన కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ఆగిరిపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో శనివారం జరిగింది. ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాలివి.. నూజివీడు మండలం, సుంకొల్లు గ్రామానికి చెందిన తేజస్విని (22)కి మూడేళ్ల క్రితం వట్టిగుడిపాడుకు చెందిన నాగరాంబాబుతో వివాహం జరిగింది. వీరికి కవల ఆడపిల్లలు జన్మించారు. వివాహ సమయంలో పసుపు కుంకుమ కింద 50 సెంట్ల భూమిని కట్నంగా ఇచ్చారు. సదరు భూమిని తేజస్విని తండ్రి బ్యాంకులో తనఖా పెట్టుకున్నారు. ఏడాదిగా పొలం కాగితాలు ఇవ్వాలంటూ కుమార్తె ఒత్తిడి చేయడంతో, ఆర్థిక పరిస్థితులు బాగోలేక తండ్రి ఇవ్వలేకపోయాడని ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై శనివారం కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఆమె తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన భర్త ఆత్మహత్య చేసుకున్న భార్యను చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తల్లిని కోల్పోయిన చిన్నారులు అనాథలుగా మిగిలారు. తేజస్విని తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ బిల్లులతో కోళ్ల వ్యర్థాల రవాణా

» దెందులూరు పోలీసుల తనిఖీలు.. వాహనం సీజ్



సీజ్ చేసిన వ్యాన్

దెందులూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు మేతగా వినియోగిస్తున్నారు. వాహనదారులు పలు రకాల నకిలీ బిల్లులతో రవాణా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం ఉండిలోని ప్రముఖ ఫ్యాక్టరీ పేరుతో నకిలీ బిల్లుతో వెళ్తున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని దెందులూరు ఎస్ఐ శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీల్లో భాగంగా దెందులూరు జాతీయ రహదారిపై ఓ వాహనాన్ని పట్టుకుని సీజ్ చేశారు. ఈ వాహనంలో 12, 500 కేజీల కోళ్ల వ్యర్థాలు రవాణ చేస్తున్నారు. నకిలీ బిల్లులతో రవాణా చేస్తున్న డ్రైవర్‌తో వాహనదారుడిపై కేసు నమోదు చేశారు.



రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి నిరసన తెలుపుతున్న కుటుంబసభ్యులు

మృతురాలు రాసిన లేఖ

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

» అక్రమ కేసులే తన చావుకు కారణమని లేఖ

» మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన కుటుంబసభ్యులు

యలమంచిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం కొంతేరు గ్రామానికి చెందిన చింతా లక్ష్మీనరసమాంబ(53) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించిన వ్యవహారంలో లక్ష్మీనరసమాంబ పెద్ద కుమారుడు నిఖిల్‌సాయి గతేడాది డిసెంబరు 14న ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి ఆ యువతి తండ్రి అడ్డాల నాగేశ్వరరావు తనపైన, తన కుటుంబసభ్యులపైనా అక్రమకేసులు పెట్టి వేధిస్తున్నారని.. వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆమె లేఖ రాసింది. ఈమేరకు ఆమె కుటుంబసభ్యులు మృతదేహాన్ని వేధింపులకు కారణమైన నాగేశ్వరరావు ఇంటి ముందు ఉంచి నిరసనకు దిగారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుమారుడిని పోగొట్టుకున్న ఆరు నెలలకే తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. యలమంచిలి పోలీసులను వివరణ కోరగా గ్రామస్థుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.



నిర్మించిన మూడు అంతస్తుల భవనం.. (ఇన్‌సెట్) కూల్చివేస్తున్న దృశ్యం

మూడంతస్తుల భవనాన్ని తొలగిస్తున్న అధికారులు

పాలకోడేరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అర సెంటులో అనధికారికంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనాన్ని చూసి అవాక్కైన డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు తక్షణమే కూల్చివేయాలంటూ ఆదేశాలిచ్చారు. పాలకోడేరులోని మంగయ్య చెరువు గట్టును చేర్చి సుమారు అర సెంటులోపు ఉన్న స్థలంలో అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కొత్తపల్లి చంద్రావతి మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. పంచాయతీ అధికారులు నిర్మాణం నిలుపుదల చేయాలని చెప్పినా ఆమె పనులను కొనసాగించారు. ఇటీవల పాలకోడేరులో సీసీ రహదారులను ప్రారంభించడానికి విచ్చేసిన డిప్యూటీ స్పీకర్ ఆ బిల్డింగ్‌ను చూసి అధికారులను నిలదీసి వెంటనే కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి గోపి మూడో అంతస్తును సిబ్బందితో తొలగింపచేశారు. మిగిలిన బిల్డింగ్‌ను కూడా కూల్చేస్తామని తెలిపారు. అర సెంటులో అందరినీ అబ్బురపరిచే విధంగా నిర్మించిన ఈ బిల్డింగ్ కనుమరుగు కానుంది.

గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురి అరెస్టు

కారు, రెండు కత్తులు, ఐదు సెల్ ఫోన్‌లు, నగదు స్వాధీనం



గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశామని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, తాళ్ళపూడి ఎస్ఐ టి.రామకృష్ణ కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో కారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి 26 కేజీల గంజాయి, కారు, రెండు కత్తులు, ఒక ఇనుపరాడ్డు, ఐదు సెల్ ఫోన్‌లు, రూ.1,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. కత్తులతో నేరం చేయాలనే ఉద్దేశంతో తిరుగుతున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి విచారించారు. పెనుమంట్ర మండలం మార్టేరుకి చెందిన సాకా వంశీ, తణుకు పట్టణానికి చెందిన ఇజ్జాడ పాపినాయుడు, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి సామ్యేలు, పాలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురు ప్రసాద్, పెరవలికి చెందిన చినిమిల్లి శివకృష్ణ, నవరపు ప్రవీణ్ ఏడుగురు కలిసి ఒక ప్రైవేటు ట్రావెల్స్ నుంచి కారును అద్దెకు తీసుకుని దోపిడీ చేయడానికి నిర్ణయించుకుని బయలుదేరారు. దొంగతనం చేసేందుకు ఇనుప రాడ్డు, ఒక పెద్దకత్తి, చాకు వంటి చిన్న కత్తిని కారులో పెట్టుకుని శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో బంగారపు షాపులో దొంగతనం చేయడానికి సన్నాహం చేస్తున్నట్టు తెలిపారు. ముందుగా రెక్కీ నిర్వహించుకుని అక్కడనుంచి వస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా దారవరంలో 26 కేజీల గంజాయిని తీసుకుని కారులో పెట్టుకుని పెరవలి వస్తున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం వాహన తనిఖీ లు నిర్వహిస్తున్న పోలీసులు కారును నిలుపుదలచేసి అనుమా నాస్పదంగా కనిపించిన ఏడుగురిని విచారించి, అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపించామన్నారు.

మహిళల మొబైల్లో శక్తియాప్ ఉండాలి

ఏలూరు క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ మొబైల్లో శక్తియాప్ ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్‌ఐ కాంతిప్రియలు అన్నారు. శనివారం నగరంలో మహిళలకు, యువతులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉండి పోలీస్ సహాయాన్ని పొందాలనుకుంటే శక్తియాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే పది నిముషాల్లోపు పోలీసులు వస్తారన్నారు. మహిళలు యాప్‌పై అవగాహన పెంచు కుని తమకు రక్షణగా ఉపయోగించుకోవాలని సూచించారు.

102 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్

ఏలూరుకార్పొరేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రామకోటి ప్రాంగణంలో శనివారం లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆయుష్ వైద్యాధికారి బి.వి.ఎం.నగేశ్ 102 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ సూచనల మేరకు మందులు వాడాలన్నారు. శిబిరంలో స్థానికులు బొలిశెట్టి సురేశ్ కుమార్, పిల్లి పండరీనాథ్, అజయ్‌కుమార్, లోకేష్ సేవలు అందించారు. ఆయుర్వేద వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పష్టత లేని జీవోల పట్ల అసంతృప్తి

ఏలూరు రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి):సచివాలయాల రేషనలైజేషన్‌కి గ్రామ వార్డు సచివాలయాల సెక్రటరీ స్పష్టత లేకుండా జీవోలు విడుదల చేయడం పట్ల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన జీవో 4, తాజాగా విడుదల చేసిన జీవో 5లతో రెవెన్యూ ఉద్యోగులు గందరగోళంలో పడ్డారన్నారు. రెవెన్యూ శాఖలో చాలా కాలం నుంచి క్రియాశీలకంగా పని చేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులను వారి లైన్ డిపార్ట్మెంట్‌కు సంబంధం లేకుండా స్పష్టత లేని జీవోలివ్వడంతో గందరగోళంగా మారిందన్నారు. తమకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు వినతిపత్రం అందజేయనున్నట్టు రవీంద్రరాజు తెలిపారు.

ఎమ్మెల్యే చంటిని కలిసిన బీసీ సంఘాల నాయకులు



ఏలూరు రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా, బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా సభ్యులు, మహిళా సంఘం సభ్యులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తల్లికి వందనం అత్యధికంగా బీసీ కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. భవిష్యత్‌లో ఏలూరు బీసీ సంఘాలు అండగా ఉంటామన్నారు. జిల్లా అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి, బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పామర్తి ఏసురాజు, రాష్ట్ర బీసీఓ, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎస్‌పిఆర్ విటల్‌కుమార్, ఉక్కుసూరి గోపాలకృష్ణ, పువ్వల ఆంజనేయులు, పట్నాల శేషగిరిరావు, ఎమ్మెల్యేను కలిశారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి : సీపీఐ

కుక్కునూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పోడునరికి సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరు ఫారెస్ట్ రేంజ్ అధికారిని కృష్ణకుమారికి వినతిపత్రం అందజేశారు. పట్టాలివ్వకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. నాయకులు వెంకటేశ్వరరావు, ఎండీ.మున్నీర్, కారం ధారయ్య, కొన్నే లక్ష్మయ్య, బాడిస రాము, బాబూరావు పాల్గొన్నారు.

ముగ్గురికి సీఎం సహాయ నిధి చెక్కులు



కామవరపుకోట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆడమిల్లి గ్రామానికి చెందిన కానర్నేని రాంబాబు, నర్రాల లక్ష్మీనారాయణ, కళ్ళచెరువుకు చెందిన స్వామిలకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.లక్షా 30 వేల విలువైన చెక్కులను టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ శనివారం అందజేశారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసిన వెంటనే సహకరించిన చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. బుడ్డియ్య, పాటిమళ్ళ సుబ్బారావులు పాల్గొన్నారు.

దోసపాడులో వికసిత భారత అమృతకాలం



దెందులూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, మండలాధ్యక్షురాలు చికటి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో వికసిత భారతదేశపు అమృతకాలం కార్యక్రమాన్ని దోసపాడులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిషోర్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమా కార్యక్రమాలను వివరించారు. అనంతరం బీజేపీ నాయకులు మండూరి బుజ్జిగోపాల్, ఫింగుల నాగరామనోహన్‌రావు, నేతల యేసోబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మొక్క నాటారు. బీజేపీ నాయకులు చీకటి ప్రభు చౌదరి, వేగుంట చౌదరి, తోట ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కామవరపుకోట, జూన్ 14(ఆంధ్రజ్యోతి) :తూర్పు యడవల్లిలో సీతారాముల ఆలయం వద్ద వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు అహళంబి శేషాచార్యులు బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. కల్యాణోత్సవం అనంతరం హనుమత్ వాహన సేవ, గ్రామోత్సవం, నివేదన జరిపి మంగళ శాసనం తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. 16తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని శేషాచార్యులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : చింతమనేని



పెదవేగి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కరిస్తారనే ఆశతో మనదగ్గరకు వచ్చే వారిని ఒకటికి నాలుగుసార్లు తిప్పించుకోకుండా తక్షణం సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. దుగ్గిరాల కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగదన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై అధికారులు మరింత శ్రద్ధపెట్టాలని ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలుంటాయని ప్రభాకర్ హెచ్చరించారు.

డబ్బులు స్వీకరించేటప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయొద్దు

ఏలూరు క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డబ్బులను ఇతరులకు చెల్లించే సమయంలోనే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని, తీసుకునేటప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయకూడదని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రజలకు సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయన్నారు. సైబర్ నేరస్తులు ఫోన్లకు మెస్సేజ్‌ల రూపంలో కాని, వాట్సాప్‌ల రూపంలో, మెయిల్స్‌కు క్యూఆర్ కోడ్‌లను పంపిస్తారని, వాటిని ఓపెన్ చేయకూడదన్నారు. డిజిటల్ పేమెంట్లు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు

ఏలూరు క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఆశ్రం ఆసుపత్రి సమీపంలో వేసగాని బ్రిడ్జి వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణ కోసం భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కిషోర్ ఆదేశించారు. దీంతో ఏలూరు ట్రాఫిక్ విభాగం కీలక చర్యలు చేపట్టింది. ఆ ప్రాంతాల్లో రాత్రి వేళ లైటింగ్ కనిపించకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించి ఏడు సోలార్ స్ట్రీట్ లైట్లు, నాలుగు సైన్ బోర్డులు, 10 స్పీట్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేశారు.

లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఏలూరుటూటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా ప్రజలకు సేవలందించే బాధ్యత లయన్స్ క్లబ్‌దని ఎమ్మెల్సీ, లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ వంకా రవీంద్రనాథ్ అన్నారు. గ్రీన్‌సిటీ లయన్స్ జిల్లా సేవా సంఘం భవనంలో ఏలూరు సెంటర్ లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ వందేళ్ల లయన్స్ క్లబ్ ముందు చూపుతో సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తుందన్నారు. లయన్స్ జిల్లా నాయకులు వంకా రాజకుమారి నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులుగా వీ.వెంకటనాగలక్ష్మి, కార్యదర్శి ఎస్.సుజాత, కోశాధికారి మహ్మద్ ముంతాజ్‌బేగం ప్రమాణ స్వీకారం చేశారు. సి.హెచ్.అవినాష్ పాల్గొన్నారు.

కోర్టు మోనిటరింగ్ సెల్ ఏర్పాటుతో సత్ఫలితాలు

ఏలూరు క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కేపీఎస్ కిశోర్ జిల్లా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కోర్టులో కేసుల విచారణకు పోలీస్ శాఖ సహకరించే నిమిత్తం కోర్టు మోనిటరింగ్ సెల్‌ను ఏర్పాటుతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఇన్‌చార్జి పర్యవేక్షణతో ఇప్పటికి 11 మంది నేరస్థులకు జీవిత ఖైదును కోర్టులు విధించాయి. వివిధ న్యాయస్థానాలు జిల్లాలోని మొత్తం 36 మంది ముద్దాయిలకు జైలు శిక్షలు పడేలా కోర్టు మోనిటరింగ్ సెల్ పనిచేసింది.



యోగా చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



ద్వారకాతిరుమలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



భీమడోలులో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

యోగా సాధన చేయండి..

ప్రజలకు పిలుపునిచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వి - జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న అధికారులు

పెదపాడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని టీటీడీసీ వేదికగా యోగాంధ్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ యోగా మొక్కుబడిగా కాకుండా ఆరోగ్యాన్ని పెంపొందించుకునేలా చేయాలన్నారు.21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరికీ యోగాను వారి జీవన శైలిలో భాగస్వామ్యం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రెండు కోట్ల మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు 8,50,189 మంది పౌరులు యోగాంధ్ర యాప్‌లో నమోదయ్యారని కలెక్టర్ తెలిపారు. 18న కామవరపుకోట మండలం, గుంటుపల్లి బౌద్ధరామాల్లో యోగాంధ్రను నిర్వహిస్తామన్నారు. ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.వి.విశ్వే శ్వరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుభద్ర, డీఎల్డీవో లక్ష్మి, తహసీల్దారు శేషగిరి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

● లింగపాలెం: యోగాతో మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని ఎంపీడీవో కె.వాణి అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెం గ్రామ సచివాలయంలో యోగా నిర్వహించారు. అధికారులు, ప్రజలతో యోగాసనాలు వేయించారు. పాతూరి శ్రీనివాసరావు, చల్లా నాగబాబు, కె.వి.ఎస్.వి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: జిల్లా మ్యూజియంలోని ఏడీ కె.తిమ్మరాజు ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో యోగా ప్రస్తావన క్రీ.పూ.5000 సంవత్సరాల క్రితమే ఉందన్నారు. దత్త క్రియ యోగా నిపుణులు వేణుగోపాల లునాని, యోగా ఉపన్యాసకులు పి.సాంబశివరావు, సాయి లలిత ధాన్య పీఠం చైర్మన్ శ్యామలాదేవి పాల్గొని యోగ ప్రాముఖ్యతను తెలిపారు. జిల్లా మ్యూజియం ఇన్‌చార్జి సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల:ప్రతి ఒక్కరూ యోగాను దిన చర్యగా మార్చుకోవాలని ఈవోపీఆర్డీ సుబ్బరాయన్, మహిళా పోలీస్ లక్ష్మీసుజన పేర్కొన్నారు.యోగాంధ్రలో భాగంగా ఉదయం గురుకులం విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయులు, అధికారులు యోగాసనాలు వేశారు.

● భీమడోలు: యోగా వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందుతుందని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం మండల వ్యాప్తంగా యోగాంధ్రను నిర్వహించారు. భీమడోలులో ఎంపీడీవో పద్మావతిదేవి, పోలసానపల్లిలో తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం, నాయకులు సుబ్బారావు, శ్రీనుబాబు, సత్యనారాయణ, యోగాసనాలు వేశారు.

● ఉంగుటూరు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో యోగా ప్రదర్శన నిర్వహించారు. ఉంగుటూరు కమ్యూనిటీ హాల్లో యోగాంధ్ర నిర్వహించగా పలు శాఖల అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు.

● కామవరపుకోట: తాడిచర్లలో సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి మందిరం వద్ద యోగాంధ్రను నిర్వహించారు. అదే విధంగా గుంటుపల్లిలో నాయకులు బేతిన వెంకట్రావు, గోరింక దాసు, కంఠమనేని ఆంజిమూర్తి యోగాసనాలు వేశారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

బుట్టాయగూడెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల కోసం 31 రోజులుగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీలు రిలే నిరహార దీక్షలు చేస్తున్నారని తక్షణమే వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ ఎంపీటీసీ మడకం జంపాల రావు డిమాండ్ చేశారు. శనివారం నాటి దీక్షల్లో పాల్గొని మద్దతు తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలన్నారు. దీక్షల్లో సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, పూసం శ్రీను, కుంజా రమేశ్, పొడియం కొవ్వాడయ్య, సోదెం ముక్కయ్య, పోడియం కృష్ణ, ముచ్చిక కృష్ణ, తెల్లం గంగరాజు, పొడియం నాగరాజు పాల్గొన్నారు.

రేపు పీజీఆర్ఎస్ అమలు

ఏలూరు,జూన్ 14(ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదులను పరిష్కారాన్ని మరింత వేగవంతంగా నిర్వహించేందుకు నిర్వహించే పీజీఆర్ఎస్ సేవలను ఈ నెల 16న జిల్లా కలెక్టరేట్‌తో పాటు, మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిల్లోను నిర్వహిస్తున్నామని, ప్రజలు గమనించి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోనే ఫిర్యాదులు అందివచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదే విధంగా ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అందించిన వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ:// మీకోసం. ఏపీ.జీవో.ఇన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తల్లుల్లో పెల్లుబికిన ఆనందం

పథకాల అమలుతో లబ్దిదారుల్లో ఆనందం
సీఎం, డిప్యూటీ సీఎంలకు క్షీరాభిషేకం

ఏలూరు రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని కొల్లేరు నాయకులు, టీడీపీ గ్రామ సీనియర్ నాయకులు సైదు గోవర్ధన్ అన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం నలుగురు పిల్లలున్న తల్లులకు సైతం తల్లికి వందనం అమలు చేస్తూ బ్యాంకు ఖాతాల్లో 60వేల రూపాయలు జమ చేశారన్నారు.

● కుక్కునూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబంలోనూ చదువుకున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.13వేలు జమ చేశారని టీడీపీ మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. శనివారం కుక్కునూరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు, ఫొటోలకు క్షీరాభిషేకం చేశారు. ర్యాలీలో ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, జనసేన నాయకులు మంత్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, బీజేపీ నాయకులు వీ.లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రాజాన పండు, చిట్రోజు తాతాజీ, మహంకాళి రామ్మోహనరావు, తూటిగుంట దుర్గారావు, కంపా రాజేంద్ర, అల్లూరి రామకృష్ణ, మారిశెట్టి బాల చిట్టెమ్మ, గుళ్ళపూడి శ్రీదేవి పాల్గొన్నారు.



ప్రగడవరం దళితవాడలో క్షీరాభిషేకం దృశ్యం

● చింతలపూడి: ప్రగడవరం పంచాయతీ పొనుకుమాడు ఎస్సీ కాలనీలో శనివారం చంద్రబాబు చిత్రపటానికి గ్రామస్థులు పాలాభిషేకం చేశారు. ప్రగడవరం టీడీపీ గ్రామాధ్యక్షుడు టి.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం విజయవంతంగా అమలు చేశారన్నారు. పొనుకుమాడు దళితవాడలో జరిగిన కార్యక్రమంలో నలగోపు కృష్ణమూర్తి, నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయానికి భక్తుల తాకిడి



పోలవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సుదర్శన కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. ఉమ్మడి ఉభయ గో దావరి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. పోలవరం తాళ్ళపూడి, గోపాలపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు కా లినడకన వచ్చి స్వామివారి దర్శనాలు చేసుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

బుట్టాయగూడెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కొండరెడ్లకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకం ద్వారా అందిస్తున్న పథకాలపై ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు కె.ఆర్.పురం ఐటీ డీఏ పరిధిలోని కొండరెడ్డి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలను చేపట్టి నట్టు ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

టి.నర్సాపురం, జూన్14(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. మండలంలోని అల్లూరి సీతారామ రాజు నగర్‌లో శనివారం సీపీఎం నాయకులు అలుమోలు మురళి అధ్యక్షతన సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి ఆధ్వర్యంలో పలు సమస్యలపై చర్చించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవి మాట్లాడుతూ తక్షణమే రాష్ట్రప్రభుత్వం కల్పించుకుని పొగాకు రైతుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, వరగడ కుమారి, మెండ్రు శిరీష పాల్గొన్నారు.

రేపటి నుంచి కళాశాల తరగతులు

దెందులూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెం శ్రీసీతారామ వ్యాయామ విద్య కళాశాల తరగతులు 16వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పీఈటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతాయల్ తెలిపారు. శనివారం వ్యాయామ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలి

జీలుగుమిల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లిలో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమీప సీఆర్ఆర్ కాలనీలో గత రెండేళ్లుగా ఈ సమస్యను స్థానికులు ఎదుర్కొంటున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం విద్యుత్ సరఫరాలో లోపం వల్ల ఇళ్లలో టీవీలు, ఫ్యాన్‌లు కాలిపోయాయన్నారు. రెండ్రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా కాకపోవడంతో తాగు నీటి సమస్య తలెత్తిందన్నారు.

విద్యార్థి శివసాయిరామ్‌కు అభినందన



పెదవేగి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జానంపేటలోని సెయింట్ లూసీ హైస్కూల్ విద్యార్థి శిరుగబత్తుల శివసాయిరామ్ ఇటీవల జరిగిన టెన్త్ పరీక్షల్లో 578 మార్కులతో ప్రతిభ చాటి, ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల హెడ్ సిస్టర్ బీనా జోసెఫ్, సిబ్బంది విద్యార్థి శివసాయిరామ్‌ను అభినందించారు.

డీఎస్సీ పరీక్షకు 341 మంది హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లోభాగంగా శనివారం జరిగిన పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం షిఫ్టునకు 180మంది అభ్యర్థులకుగాను 167మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 205మందికి గాను 174 మంది హాజరయ్యారు. మొత్తం మీద 44మంది గైర్హాజరయ్యారు.

రామచంద్రరావుపేటలో ఉచిత వైద్యం

ఏలూరు రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవలందించడమే ఉచిత వైద్య శిబిరాల లక్ష్యమని ప్రముఖ ఆర్థో వైద్య నిపుణుడు కృష్ణ అన్నారు. రామచంద్రరావుపేటలో శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 300 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.



మందులు అందజేస్తున్న వైద్యుడు కృష్ణ

బీసీలకు ఏఎంసీ పదవి ఇవ్వాలి

చింతలపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి బీసీలకు కేటాయించాలని బీసీ నాయకులు కె.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మార్కెట్ యార్డు ఏర్పడిన నాటి నుంచి బీసీలకు అవకాశం కల్పించలేదని, నియోజకవర్గంలో అధిక జనాభాలో బీసీలున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవి ఎస్సీలకు వచ్చినందున మార్కెట్ యార్డు పదవి బీసీలకు ఇస్తే బాగుంటుందన్నారు.

26న మండల సమావేశం

టి.నర్సాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి.నాగరాజ కుమారి శనివారం తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు దారబోయిన లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొనాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల్లో సాధించిన ప్రగతి నివేదికలతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

రక్తదానం అలవాటుగా మార్చుకోవాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ బేబీ కమల సూచించారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఏరియా ఆసుపత్రి నుంచి పట్టణంలో ప్రధాన వీధుల్లో రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదాతలను సన్మానించారు. ర్యాలీలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కంచర్ల గణేష్, నాయుడు శ్రీను, డి.వెంకటలక్ష్మి, కోటగిరి ప్రమీల పాల్గొన్నారు.

రక్తదాతలకు ఘనంగా సత్కారం..

ఏలూరు క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ వంశీకృష్ణ, ధన్యశ్రీ, సత్యనారాయణ, డాక్టర్ పావని పాల్గొని 30 సార్లు రక్తదానం చేసిన ఎ.హేమేంద్రకుమార్, 25 సార్లు రక్తదానం చేసిన పి.శ్రీనివాసరావులను సన్మానించారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో 88 సార్లు రక్తదానం చేసిన యూటిఎ శ్రీనివాసరావును, రక్తదానంపై అవగాహన కల్పిస్తూ రక్తదానం చేయిస్తున్న పి.అయ్యప్పను జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వి ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని అన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం : చంటి

ఏలూరుటూటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజల కలలను సహకారం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జూట్‌మిల్లు వద్ద కృష్ణ కాల్వపై రూ.5కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ బ్రిడ్జి పనులు నాణ్యతతో చేసి అగ్రిమెంట్ చేసుకున్న సమయానికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.. కార్యక్రమంలో ఇడా చైర్మన్ శివప్రసాద్, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెదగొన్నూరు ఫీడర్‌లో ఉప్పరగూడెం, పెదగొన్నూరు, విశ్వనాద్రిపాలెం, ఈడేపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. విద్యుత్ లైన్ల వెంబడి చెట్లను నరికే పనులు నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదార్లు సహకరించాలని కోరారు.

నేడు గుడిపాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

మునునూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గుడిపాడు గ్రంథాలయం వద్ద మంత్రి పార్థసారథి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. విజయవాడ వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ వైద్యశిబిరంలో అనుభవం గల వైద్యులు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయడంతోపాటు మందులు, కళ్లజోళ్లను ఇవ్వడం జరుగుతుందని నాయకులు తెలిపారు.






ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామంలో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం లబ్ధిపొందిన కుటుంబాలు వరుసగా భట్టు శ్రీవాణి, చిట్టిబొమ్మల సీతామహాలక్ష్మి, దారం సుకన్య, గుర్రపు పద్మ



చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన కంకోళం కనకరాజు దంపతులు, ముగ్గురు పిల్లలు

తల్లి ఆనందం

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

చాట్రాయి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చాలీచాలని ఆదాయంతో పిల్లలను ఎలా చదివించాలా అని మదన పడుతున్న తమకు తల్లికి వందనం పథకం ద్వారా కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందని చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన సన్నకారు రైతు కంకోళం కనకరాజు, కనకదుర్గ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఒకరికి మాత్రమే రూ. 13 వేలు ఇచ్చారని, ఇప్పుడు తమ ముగ్గురు పిల్లలు పూజశ్రీ, యశస్విని, నాగ శేషంరాజుకు రూ. 39 వేలు బ్యాంకు ఖాతాలో వేశారని, తమ కుటుంబానికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఉన్నత విద్యావంతుల్ని చేస్తాం..

కూలి పనులు చేసుకుంటూ జీవించే తమకు పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలనే ఆశ ఉన్నా, ఎలా సాధ్యమని బెంగ ఉండేదని, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద తమ ముగ్గురు పిల్లలు కీర్తి, నవ్య, రితిక్‌లకు రూ. 39 వేలు బ్యాంకు ఖాతాకు జమ చేయటంతో ఇక పిల్లల చదువులకు ఢోకా లేదని ధైర్యం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. చాట్రాయి మండలం కోటపాడు గ్రామానికి చెందిన అబ్బదాసరి కృష్ణ దంపతులు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లల చదువుకు ఇబ్బంది ఉండదు ..

కలిదిండి: మా ముగ్గురు పిల్లలు ఆళ్ల ప్రభ కారుణ్య, వర్షిక, వర్షిక్‌లకు తల్లికి వందనం పథకంలో భాగంగా రూ.39 వేలు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. గతంలో అమ్మఒడి పథకం కింద ఒక్కరికే సాయం అందేది. కూటమి ప్రభుత్వంలో ముగ్గురు పిల్లలను ఆర్థిక ఇబ్బందులు లేకుండా పిల్లలను చదివించు కోవచ్చని ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన ఆళ్ల రాజేష్, దుర్గ కృతజ్ఞతలు తెలియజేశారు.



చాట్రాయి మండలం కోటపాడుకు చెందిన అబ్బదాసరి కృష్ణ, జ్యోతి దంపతులు, ముగ్గురు పిల్లలు



ముగ్గురు పిల్లలతో కోరుకొల్లు గ్రామానికి చెందిన ఆళ్ల రాజేష్, దుర్గ దంపతులు

మురిసిన వణుదుర్రు

ఒకే గ్రామంలో ముగ్గురేసి పిల్లలున్న ఏడు కుటుంబాలకు లబ్ధి

ముదినేపల్లి: తల్లికి వందనంతో ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. కూటమి ప్రభుత్వం ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం సొమ్ము ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆ గ్రామంలోని 99.5 శాతం విద్యార్థులకు ఈ పథకం లబ్ధి చేకూరింది. ఆ గ్రామంలోని యూపీ పాఠశాలలో 74 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తల్లికి వందనం లబ్ధి పొందేందుకు అర్హత సాధించడం విశేషం. ఆ గ్రామంలో ముగ్గురు పిల్లలు కలిగి ఉన్న ఏడు కుటుంబాల వారు ఈ పథకం లబ్ధి పొందే అవకాశం కలిగింది. ఇప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబాలకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమకావడం కూడా జరిగింది. ఆ గ్రామానికి చెందిన భట్టురాజు, శ్రీవాణి కుటుంబం, చిట్టిబొమ్మల రాముడు, సీతామహలక్ష్మి కుటుంబం, గుర్రపు శివసుబ్రమణ్యం-పద్మ కుటుంబం, దారం అప్పన్న, సుకన్య కుటుంబం, ప్రత్తిపాటి అరుణ, తాడంకి సురేష్, వెంపా అచ్చయ్య కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం లబ్ధి చేకూరింది. ఒకే గ్రామంలో ఏడు కుటుంబాల వారు ముగ్గురేసి పిల్లలకు ఈ పథకం ప్రయోజనం పొందడం విశేషం. ఈ లబ్ధి పొందిన వారిలో ఇద్దరు పిల్లలు కల్గిన కుటుంబాలు కూడా 22 ఉన్నాయి. గతంలో అమ్మఒడి పథకం కింద 45 శాతం పిల్లలు మాత్రమే ప్రయోజనం పొందేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఆ గ్రామంలోని అర్హులైన వారందరికీ తల్లికివందనం ప్రయోజనం కలిగింది.

అనర్హులకు అవకాశం

తల్లికి వందనం ఫిర్యాదుల స్వీకరణకు మార్గదర్శకాలు ఇలా..

ఏలూరు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి అనర్హులైన విద్యార్థుల జాబితాల్లో తమ పిల్లల పేర్లున్నాయని తల్లిదండ్రులు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో వీటిని స్వీకరించే ప్రక్రియపై డీఈవో వెంకటలక్ష్మమ్మ శనివారం మార్గదర్శకాలు విడుదల చేశారు. సంబంధిత సచివాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్లు/ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలు ఎన్‌బీఎం పోర్టల్‌లో లాగిన్ అయి సర్వీస్ రిక్వెస్టులో గ్రీవెన్స్‌ను రైజ్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చారని వివరించారు. సాంకేతిక కారణాల వల్ల తాత్కాలికంగా ఇనెలిజిబుల్ (అనర్హత)గా కనిపిస్తున్న వారి వివరాలను ఆఫ్‌లైన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్ నమోదు చేసిన తర్వాత ఆరు స్టెప్ వాలిడేషన్ ప్రక్రియద్వారా విద్యార్థి అర్హతపై స్పష్టత వస్తుందన్నారు. సంబంధిత కారణాలను పరిశీలించి, తగిన ఆధారాలతో దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. ఈ ప్రక్రియను జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి వచ్చే ఏ ఒక్క ఫిర్యాదును నమోదు చేయకుండా వెనక్కి పంపరాదని స్పష్టం చేశారు. ఈ పథకం అమలులో పాఠశాల విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, పథకాన్ని విజయవంతంగా అమలుచేయాలని ఆదేశించారు. ఈ మేరకు తల్లితండ్రులకు సరైన మార్గదర్శకత్వంచేసే బాధ్యత స్థానిక డీవైఈవోలు, ఎంఈవోలపై ఉందని వివరించారు. అభ్యంతరాలు స్వీకరించే గడువు ఈనెల 20వరకు ఉందని, వాటిని పరిశీలించి, అర్హతలు కలిగిన లబ్ధిదారుల అదనపు జాబితాను ఈనెల 21నుంచి 28వ తేదీవరకు జరుగుతుందని, తుదివిడత నగదు జమప్రక్రియ జూలై 5న జరుగుతుందన్నారు.

ఏఎన్ఎంల బదిలీ, పదోన్నతి కౌన్సెలింగ్ నేటికి వాయిదా

ఏలూరు అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్ఎంలకు శనివారం జరగాల్సిన బదిలీ కౌన్సెలింగ్ ఆదివారానికి వాయిదా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం తొమ్మిది నుంచి జూమ్ విధానంలో పీహెచ్‌సీల వైద్యాధికారుల సమక్షంలో రెగ్యులర్ ఏఎన్ఎంలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. అది ముగిసిన వెంటనే మధ్యాహ్నం నుంచి మాన్యువల్ విధానంలో ఏలూరు కలెక్టరేట్ హాలులో 256 మంది గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఏ (ఫిమేల్) పదోన్నతి కౌన్సెలింగ్‌ను చేపడతామని వివరించాయి. పదోన్నతి కౌన్సెలింగ్ ఆదివారం రాత్రి వరకు చేపడతామని, అప్పటికీ పూర్తి కాకపోతే మిగిలినవారికి సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొనసాగించేలా నిర్ణయించినట్టు తెలిపాయి. తొలుత తీసుకున్న నిర్ణయం ప్రకారమే బదిలీ, పదోన్నతి కౌన్సెలింగ్‌లను ఒకేరోజున చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినందున, ఆ మేరకు శనివారం జరగాల్సిన బదిలీ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని శుక్రవారం అర్ధరాత్రి తర్వాత మౌఖిక ఆదేశాలు అందాయని అధికార వర్గాలు తెలిపాయి.

మంత్రి లోకేశ్‌ను కలసిన వీరమల్లు



కైకలూరు/ముదినేపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉన్నా వారందరికి పథకాన్ని వర్తింపచేసినందుకు విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కైకలూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పార్టీ సమావేశానికి వచ్చి కార్యకర్తల్లో జోష్ నింపాలని కోరగా మంత్రి సుముఖత వ్యక్తం చేశారని నరసింహారావు తెలిపారు.

నీట్‌లో నాగాంబిక ప్రతిభ



ముదినేపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శనివారం విడుదలైన నీట్ పరీక్షా ఫలితాల్లో ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామానికి చెందిన పేటేటి హేమ శ్రీ సాయి నాగాంబిక జాతీయ స్థాయిలో 8958వ ర్యాంకు సాధించగా, జనరల్ ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో 911వ ర్యాంకు సాధించింది. కాగా 558 మార్కులతో 99.58 పర్సంటైల్ సాధించింది. ఈ సందర్భంగా నాగాంబిక మాట్లాడుతూ తనకు కార్డియాలజీలో స్పెషాలిటీ చేయాలని ఉందని, వైద్య వృత్తిలో రాణించి పేదలకు మంచి వైద్య సేవలు అందించాలన్నదే తన ఆశయమని వివరించింది.

దేదీప్య సాయికి 95.1 పర్సంటైల్



నూజివీడు టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షా ఫలితాలలో నూజివీడు విద్యార్థిని కుప్పాల దేదీప్య సాయి ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది. జాతీయ స్థాయిలో శుక్రవారం విడుదలైన నీట్ ఫలితాలలో దేదీప్య 460 మార్కులు (95.1 పర్సంటైల్) సాధించి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 36626 ర్యాంక్ సాధించింది. విద్యావేత్తలు కుప్పాల శంకరరావు, రాధికలు దేదీప్యను అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



గోపవరంలో సచివాలయ భవనం



చింతలపల్లిలో పునాది దశలో హెల్త్‌క్లినిక్ భవనం



మునునూరులో స్లాబ్ వేసి వదిలివేసిన ఆర్బీకే భవనం

ఆగిన నిర్మాణాలు

- అట్టహాసంగా ప్రారంభించిన వైసీపీ
- బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- కూటమి ప్రభుత్వమైనా పూర్తిచేయాలని స్థానికుల వినతి

ప్రజల వద్దకే పాలన పేరుతో గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో నూతన భవనాలకు శ్రీ కారం చుట్టి కాంట్రాక్టు పనులు సొంత పార్టీ నాయకులకే అప్పగించినా ఐదేళ్ల పాలనలో భవనాల నిర్మాణాలను పూర్తిచేయలేదు. కాంట్రాక్టర్లు మధ్యలోనే నిర్మాణాలను వదిలివేయడంతో పలు గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

ముసునూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 16 డిజిటల్ లైబ్రరీ భవనాలు నిర్మించాల్సి ఉండగా ఒక్క లోపూడిలో మాత్రమే వినియోగంలోకి రాగా, మిగిలిన 15 గ్రామాల్లో గత ప్రభుత్వ పాలనలో భూమిని కూడా కేటాయించలేదు. అలాగే 13 హెల్త్ క్లినిక్ భవనాలకు గాను రెండు వినియోగంలోకి రాగా 11 భవనాలు పునాది దశలోనే నిలిచిపోయాయి. 8 అమూల్ పాల కేంద్రాల భవనాలకు గాను ఒక్కటి మాత్రమే వినియోగంలోకి రాగా మిగిలిన 7 భవనాలకు శంకుస్థాపనలు జరగలేదు. మూడు సచివాలయ భవనాలు స్లాబ్‌లు వేసి వదిలివేశారు. మూడు ఆర్బీకే భవనాలు సైతం స్లాబ్ దశలో ఉన్నాయి. వేల్పుచర్ల గ్రామంలో ఐదు ప్రభుత్వ భవనాల్లో ఒక్కటి కూడా పూర్తిచేయలేదు. అప్పటి కాంట్రాక్టర్లుకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోనే నిర్మాణాలు పూర్తి కాలేదు. పనులు మధ్యలోనే వదలి వేయడంతో ఈ భవనాలు పశువులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయమయ్యాయి. గత ప్రభుత్వ అసమర్ధ పాలన వల్ల భవనాల పరిస్థితి ఇలా ఉందని, ఐదేళ్లలో కూడా పూర్తిచేయలేకపోతే నిర్మాణాలను ఎందుకు చేపట్టారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను కూటమి ప్రభుత్వం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన టెండర్లకు చర్యలు

నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలను పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం నూతన టెండర్లుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లింపులు పూర్తయ్యాయి. మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే త్వరలోనే భవన నిర్మాణ పనులు పునఃప్రారంభిస్తాం.

- రేగళ్ళ దుర్గాప్రసాద్, ఏఈ పంచాయతీరాజ్, ముసునూరు మండలం.

సినీ, టీవీ నటుడు అల్లం గోపాలరావు మృతి

గుండుగొలనులో విషాద ఛాయలు



అల్లం గోపాలరావు (ఫైల్ ఫొటో)

భీమడోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ, టీవీ నటుడు గుండుగొలను వాసి అల్లం గోపాలరావు మృతి పట్ల గుండుగొలనులో విషాద ఛాయలు అలముకున్నాయి. అల్లం గోపాలరావు (75) గుండుగొలనులో జన్మించిన ఆయన చిన్న నాటి నుంచి నాటక రంగంలో అనేక మెట్లెక్కి అటు టీవీ, సినీ రంగంలో పేరు తెచ్చుకున్నారు. గుండుగొలనులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఆయన స్వస్థలం అంటే అమితమైన అభిమానం కనబర్చేవారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో శనివారం ఉదయం మృతి చెందారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కట్టుబడ్డాం



విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న మంత్రి

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం 10 మంది విభిన్న ప్రతిభావంతులకు విద్యుత్ సైకిళ్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు అందించే పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, మంచంపై నుంచి కదలలేని వారికి పెన్షన్ 10 వేల రూపాయిలకు పెంచామన్నారు. అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు వారి కాళ్ళ మీద వారు నిలబడేలా స్వయం ఉపాధి పథకం క్రింద రుణాలు అందించడంతో పాటు, అర్హులైన వారికి గృహాలు కూడా అందిస్తామన్నారు.

ఎల్ఓసీ అందజేత

నూజివీడు టౌన్: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గుడిమెట్ల గ్రామానికి చెందిన ఎ. పావని కుటుంబానికి రూ.50 వేలు ఎల్ఓసీ పత్రాన్ని అందించిన మంత్రి పార్థసారథి అందజేశారు.

డబ్బులు స్వీకరించేటప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయవద్దు : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డబ్బులను ఇతరులకు చెల్లించే సమయంలోనే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని మనకి సొమ్ము చెల్లించే వారికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయకూడదని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ప్రజలకు సూచించారు. సైబర్ నేరగాళ్ళు క్యూఆర్ కోడ్‌లను పంపి సొమ్ము అకౌంట్ నుంచి తస్కరిస్తారని ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయకూడదని సైబర్ నేరస్తులు తరచుగా ఫోన్లకు మెస్సేజ్‌ల రూపంలో కాని, వాట్స్‌ప్‌ల రూపంలోకాని, మెయిల్స్‌కు కాని క్యూఆర్ కోడ్‌లను పంపిస్తారని అలాంటి వాటిని ఓపెన్ చేయకూడదన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఆగిరిపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం నూజివీడు మండలం, సుంకొల్లు గ్రామానికి చెందిన తేజస్విని (22)కి మూడేళ్ళ క్రితం వట్టిగుడిపాడుకు చెందిన నాగ రాంబాబుతో వివాహం జరిగింది. వీరికి కవల ఆడపిల్లలు జన్మించారు. వివాహ సమయంలో పసుపు కుంకుమ కింద 50 సెంట్లు భూమిని కట్నంగా ఇచ్చారు. అయితే సదరు భూమిని తేజస్విని తండ్రి బ్యాంకులో తనకా పెట్టుకున్నారు. ఏడాదిగా పొలం కాగితాలు ఇమ్మంటూ కుమార్తె ఒత్తిడి చేయడంతో, ఆర్థిక పరిస్థితులు బాగోలేక తండ్రి ఇవ్వలేకపోయాడని ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై శనివారం కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఆమె తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సేపటి అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన భర్త ఆత్మహత్య చేసుకున్న భార్యను చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తల్లిని కోల్పోయిన చిన్నారులు అనాథలుగా మిగిలారు. తేజస్విని తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.





కలిదిండిలో, ముదినేపల్లి మండలం అల్లూరులో, మండవల్లి హైస్కూల్లో యోగా

యోగాభ్యాసం

కలిదిండి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో శనివారం అధికారులు యోగాంధ్రపై ట్రయల్ రన్ నిర్వహించారు. యోగాసనాలు వేశారు. యోగాపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో కొండలరావు, కలిదిండి సర్పంచ్ మారుతీ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: యోగాంధ్రపై వికసిత్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా శనివారం ముదినేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో యోగాపై శిక్షణ నిర్వహించారు. వివిధ శాఖల ఉద్యోగులు, పార్టీల నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని వివిధ ఆసనాలను వేశారు. అల్లూరు జడ్పీ హైస్కూల్‌లో గ్రామస్థులు, సచివాలయ సిబ్బందితోపాటు బీజేపీ నాయకురాలు రెడ్డి రాధిక తదితరులు వివిధ రకాల ఆసనాలపై శిక్షణ పొందారు.

మండవల్లి: మండవల్లి పంచాయతీ పరిధిలో గల జడ్పీ హైస్కూల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి రాము, సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు, ఎంపీడీవో రామలింగాచారి, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, వెలుగు సీసీ, బుక్ కీపర్స్ పాల్గొన్నారు.

నరసాపురానికి బస్సు నడపరూ..



కలిదిండి, జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలో లంక గ్రామాల కు నర్సాపురం డిపో బస్సు ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతు న్నారు. పలు గ్రామాల నుంచి నిత్యం విద్యార్థులు నర్సాపురం కళాశాలకు రాకపోకలు సాగిస్తారు. బస్సు సౌకర్యం లేక గరిశపూడి అండర్ టన్నెల్ వరకు 12 కిలోమీటర్ల మేర సైకిళ్లపై వెళ్లి అక్కడి నుంచి నర్సాపురం బస్సులు ఎక్కుతున్నారు. లంక గ్రామాలకు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై నర్సాపురం నుంచి బంటుమిల్లి, మచిలీపట్నం బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుం టాయి. గరిశపూడి అండర్ టన్నెల్ వద్ద ఉన్న జాతీయ రహదారి నుంచి పెదలంక వరకు 9 కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మించారు. బస్సు రాకపోకలకు రోడ్డు సౌకర్యం కూడా ఉండటంతో నిత్యం ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు తిరిగితే కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు సూచిస్తున్నారు. లంక గ్రామాలకు నర్సాపురం బస్సు ఏర్పాటు చేయాలని పలుమార్లు పాలకులకు, ఆర్టీసీ అధికారులకు విన్న వించినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్ప టికైనా సంబంధిత ఉన్నతా ధికారులు నర్సాపురం డిపో బస్సును లంక గ్రామాలకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

- అక్రమ కేసులే తన చావుకు కారణమని లేఖ
- మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన కుటుంబసభ్యులు

యలమంచిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం కొంతేరు గ్రామానికి చెందిన చింతా లక్ష్మీనరసమాంబ(53) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించిన వ్యవహారంలో లక్ష్మీనరసమాంబ పెద్ద కుమారుడు నిఖిల్‌సాయి గతేడాది డిసెంబరు 14న ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి ఆ యువతి తండ్రి అడ్డాల నాగేశ్వరరావు తనపైన, తన కుటుంబసభ్యులపైనా అక్రమకేసులు పెట్టి వేధిస్తున్నారని. వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆమె లేఖ రాసింది. ఈమేరకు ఆమె కుటుంబసభ్యులు మృతదేహాన్ని వేధింపులకు కారణమైన నాగేశ్వరరావు ఇంటి ముందు ఉంచి నిరసనకు దిగారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుమారుడిని పోగుట్టుకున్న ఆరు నెలలకే తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. యలమంచిలి పోలీసులను వివరణ కోరగా గ్రామస్థుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.